క్లుప్తంగా

అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు



శేషారెడ్డి సీహెచ్‌సీ ఎదుట చేపట్టిన అక్రమ నిర్మాణం

బేతంచెర్ల: నగర పంచాయతీ అనుమతి లేకుండా పట్టణంలో ఎక్కడైనా నిర్మాణాలు చేపడితే కూల్చివేస్తామని కమిషనర్ హరి ప్రసాద్ అన్నారు. సోమవారం శేషారెడ్డి సీహెచ్‌సీ ఎదుట అక్రమ నిర్మాణాన్ని అడ్డుకున్నారు. నిర్మాణాలకు నగర పంచాయతీ అనుమతి తప్పనిసరి అని స్పష్టం చేశారు. ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

'పది' సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

బనగానపల్లె రూరల్: పట్టణంలో పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు తెలుగు పరీక్షకు పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల కేంద్రంలో 35 మంది విద్యార్థులకు గాను 18 మంది గైర్హాజరయ్యారు. జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో 54 మంది విద్యార్థులకు గాను 13 మంది గైర్హాజరైనట్లు ఆయా పరీక్ష కేంద్రాల చీఫ్ ఆఫీసర్లు రామస్వామి, శ్రీనివాసరెడ్డి తెలిపారు.

కొలిమిగుండ్లలో 13 మంది గైర్హాజరు

కొలిమిగుండ్ల: స్థానిక ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలో సోమవారం జరిగిన పదో తరగతి సప్లిమెంటరీ తెలుగు పరీక్షకు 43 మంది విద్యార్థులకు గాను 30 హాజరయ్యారని ఎంఈఓ అబ్దుల్ కలాం తెలిపారు. 13 మంది గైర్హాజరైనట్లు చెప్పారు. చీఫ్ సూపరింటెండెంట్‌గా షరీఫ్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్‌గా రమణయ్యను నియమించారన్నారు.

ఎట్టకేలకు ఇద్దరు వైద్యుల నియామకం



రోగులకు సేవలందిస్తున్న డాక్టర్

బేతంచెర్ల: పట్టణంలోని శేషారెడ్డి సీహెచ్‌సీలో ఎట్టకేలకు ఇద్దరు వైద్యులను నియమించారు. సీహెచ్‌సీలో వైద్యుల కొరతపై ఇటీవల సాక్షిలో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. వైఎస్సార్ జిల్లా పోరుమామిళ్ల నుంచి డాక్టర్ సునీల్, ఆళగడ్డ నుంచి జనరల్ మెడిసిన్ డాక్టర్ శబరీష్ కుమార్‌ను నియమించారు. దీనిపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

నేడు మండల మీట్

కోవెలకుంట్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వరప్రసాదరావు తెలిపారు. ఎంపీపీ భీమిరెడ్డి రమాదేవి అధ్యక్షతన జరిగే సమావేశంలో విద్య, వైద్యం, గ్రామీణ నీటి సరఫరా, పంచాయతీరాజ్, వ్యవసాయశాఖ, ఉపాధిహామీ పథకం, పశువైద్యం, రెవెన్యూశాఖ తదితర అంశాలపై చర్చ జరుగుతుందన్నారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, మండలస్థాయి అధికారులు విధిగా హాజరుకావాలని పేర్కొన్నారు.

భ్రూణ హత్యలకు కఠిన శిక్షలు



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ నరసింహులు

డోన్ టౌన్: సమాజంలో ఆడ పిల్లలను బతకనివ్వాలంటే భ్రూణ హత్యల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆర్డీఓ నరసింహులు అన్నారు. సోమవారం స్థానిక రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో అడ్వైజరీ మల్టీ మెంబర్ అప్రాప్రియేట్ కమిటీ (పూర్వ గర్భస్థ పిండ లింగ నిర్ధారణ) సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఆడబిడ్డలు అని గుర్తించి భ్రూణ హత్యలకు పాల్పడితే కఠిన చర్యలతో పాటు జైలు శిక్షలు ఉంటాయని తెలిపారు. స్కానింగ్ సెంటర్లు తీసుకోవాల్సిన అనుమతుల గురించి వివరించారు. రేడియాలజిస్ట్‌తో పాటు ఆరు నెలల శిక్షణ పొందిన సివిల్ అసిస్టెంట్ సర్జన్, స్త్రీ వ్యాధి నిపుణులు మాత్రమే పరీక్షలు నిర్వహించాలని ఇతరులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. లైసెన్సు రిన్యూవల్ చేయించుకోవాలని తెలిపారు. కమిటీ ప్రతి మూడు నెలలకు ఒకసారి సమావేశమై చర్చించుకోవాలని, భ్రూణ హత్యల నివారణకు కృషి చేయాలన్నారు. సమావేశంలో వైద్యాధికారులు చెన్నకేశవులు, అమృత, సామాజిక కార్యకర్తలు మమ్మద్ రఫీ, ఏఈ నాగరాజు, రాఘవేంద్రగౌడ్, రేడియాలజిస్టులు, ప్రైవేట్ ఆస్పత్రుల యజమాన్యాలు పాల్గొన్నాయి.

భవనాలున్నా నిరుపయోగం

- ప్రారంభానికి నోచుకోని సచివాలయ భవనాలు
- చాలీచాలని గదులతో సచివాలయ ఉద్యోగుల అగచాట్లు
- అర్ధాంతరంగా నిలిచిన నిర్మాణాలు
- లక్షల రూపాయల ప్రజాధనం వృథా
- ప్రభుత్వ తీరుపై సర్వత్రా విమర్శలు



కమలపురి సచివాలయం ఆవరణలో పెరిగిన కంపచెట్లు



పనులు ఆగిపోవడంతో అసంపూర్తిగా ఉన్న గిద్దలూరు సచివాలయం

సంజామల: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రజలకు స్థానికంగానే సేవలందించాలనే ఉద్దేశంతో సచివాలయ వ్యవస్థను అందుబాటులోకి తెచ్చింది. ఇందు కోసం గ్రామాల్లో సచివాలయాలను నిర్మించింది. సంజామల మండలంలో సుమారు రూ.4.40 కోట్లతో సంజామల, ముదిగేడు, ముక్కమల్ల, కానాల, ఆల్వకొండ, నొస్సం, ఆర్.లింగందిన్నె, పేరుసోముల, ఆకుమల్ల, కమలపురి, గిద్దలూరు గ్రామాల్లో సచివాలయాలు ఏర్పాటయ్యాయి. ఈ వ్యవస్థకు అనుసంధానంగా వలంటీర్ వ్యవస్థతో ఇంటి వద్దకే పాలన అందించింది. అయితే కూటమి సర్కార్ సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేసింది. వలంటీర్ వ్యవస్థను తొలగించి సచివాలయంలో అందే సేవలను దూరం చేసింది.

సచివాలయ వ్యవస్థ నిర్వీర్యం

కమలపురిలో రూ.40 లక్షలతో సచివాలయం నిర్మించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నిర్మాణ పనులు దాదాపు పూర్తయ్యాయి. ఇంతలోనే సార్వత్రిక ఎన్నికలు రావడంతో సచివాలయ భవనం ప్రారంభానికి నోచుకోలేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడి దాదాపు 11 నెలలు అవుతున్నా సచివాలయ ప్రారంభంపై దృష్టి సారించలేదు. దీంతో సచివాలయ ఆవరణ మొత్తం కంపచెట్లు, పిచ్చిమొక్కతో దర్శనమిస్తున్నాయి. గ్రామంలో సచివాలయం సిద్ధంగా ఉన్నా శిథిలావస్థలో ఉన్న పాత పంచాయతీ బోర్డు కార్యాలయంలోనే ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తున్నారు. అలాగే గిద్దలూరు గ్రామంలో సచివాలయ నిర్మాణ పనులు చివరి దశలో ఆగిపోయాయి. అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటే నెల రోజుల్లో గిద్దలూరు సచివాలయం పూర్తి అవుతుందని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కమలపురి, గిద్దలూరు గ్రామాల్లో సచివాలయ భవనాలను అందుబాటులోకి తేసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

వెంటనే పూర్తి చేయాలి



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజలకు మెరుగైన సేవలు అందించాలనే ఉద్దేశంతో ప్రతి గ్రామంలో సచివాలయాలను నిర్మించింది. మండలంలో 11 సచివాలయాలకు గాను 2 సచివాలయాలు ప్రారంభానికి నోచుకోలేదు. ప్రజా ధనంతో నిర్మించిన భవనాలను ఇలా నిరుపయోగంగా ఉంచేయడం సరి కాదు. రాజకీయ కక్షతో కూటమి నాయకులు వాటిపై దృష్టి సారించడం లేదు. ఆ భవనాలను ప్రజలకు అందుబాటులోకి తీసుకుని రావాలి.

–మల్కిరెడ్డి వెంకట సుబ్బారెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు, సంజామల

త్వరలో ప్రారంభిస్తాం



కమలపురి, గిద్దలూరు గ్రామాల్లోని సచివాలయాలను త్వరలో ప్రారంభిస్తాం. కమలపురి సచివాలయం వర్క్ మొత్తం పూర్తయింది. గిద్దలూరు సచివాలయం చివరి దశలో ఉంది. పనులు తర్వగా పూర్తి చేయాలని ఆదేశించాం. పనులు పూర్తి కాగానే సచివాలయాలను అందుబాటులోకి తీసుకొస్తాం.

–సాల్మన్, ఎంపీడీఓ, సంజామల

ఉమామహేశ్వరుని పల్లకీ సేవ



పల్లకీ సేవ నిర్వహిస్తున్న ఆలయ సిబ్బంది

బనగానపల్లె రూరల్: యాగంటి ఉమామహేశ్వర స్వామి ఆలయంలో సోమవారం సాయంత్రం స్వామివారి పల్లకీ సేవను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ఈఓ చంద్రుడు, అర్చకుల ఆధ్వర్యంలో ఉదయం ఉమామహేశ్వరునికి అభిషేకం, అర్చన తదితర పూజలు చేశారు. సాయంత్రం శివ పార్వతుల ఉత్సవ విగ్రహాలను ముస్తాబు చేసి పల్లకీలో కొలువుంచి ఆలయ ప్రాకారంలో ఊరేగించారు. కార్యక్రమంలో పాతపాడు సర్పంచ్ మహేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్వామివారి సేవలో కాటసాని జయమ్మ

ఉమామహేశ్వరస్వామిని బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సతీమణి కాటసాని జయమ్మ దర్శించుకున్నారు. శివపార్వతులకు అభిషేకం, అర్చన తదితర పూజలు చేశారు. అనంతరం ఆలయ సిబ్బంది ఆమెను సత్కరించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

సచివాలయ ఏఎన్ఎంలకు న్యాయం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న మైమూన్

కోవెలకుంట్ల: గ్రామ సచివాలయాల్లో విధులు నిర్వర్తిస్తున్న ఏఎన్ఎం పోస్టులను రెగ్యులర్ చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షురాలు ఏ. మైమూన్ కోరారు. సోమవారం కోవెలకుంట్లలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. అర్హత ఉన్న ఏఎన్ఎంలకు ఎంపీహెచ్ ఈఓలుగా పదోన్నతులు కల్పించాలన్నారు. క్షేత్రస్థాయి సిబ్బందికి ఎఫ్ఆర్ఎస్ తొలగించాలని, ఏఎన్ఎంలపై పనిభారం తగ్గించాలని డిమాండ్ చేశారు. ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వివిధ యాప్‌ల ద్వారా నిర్వహించే సర్వేకు సంబంధించి పారితోషకం ఎంఎల్‌హెచ్‌పీలకు ఇస్తున్నారని, అలా కాకుండా ఆ మొత్తాన్ని ఏఎన్ఎంలకే అందజేయాలని, పెండింగ్‌లో ఉన్న వ్యాక్సిన్ ట్రావెల్ అలవెన్స్‌ను విడుదల చేయాలని పేర్కొన్నారు. త్వరలో చేపట్టే ఏఎన్ఎంల బదిలీలను పారదర్శకంగా చేపట్టాలని కోరారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 143 జీఓ ప్రకారం 14 మంది ఉద్యోగులు ఉండాలని, చాలా చోట్ల ఉద్యోగుల సంఖ్య తక్కువగా ఉందన్నారు. సంఘం నాయకురాళ్లు లక్ష్మి, మాధవి, లక్ష్మిదేవి, శ్రీదేవి, జ్యోతి, బావమ్మ, చాముండేశ్వరి, చౌడేశ్వరి, సుజాత పాల్గొన్నారు.

'మాపై దుష్ప్రచారం చేస్తే పుట్టగతులుండవు'

- సొంత పార్టీ నేతలపై కోట్ల సుజాతమ్మ ఆగ్రహం

డోన్: తమ కుటుంబానికి అవినీతిని అంటగట్టి అప్రతిష్టపాలు చేయాలని సొంత పార్టీ నేతలే ప్రయత్నిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ ఆరోపించారు. డోన్‌లోని సాయి ఫంక్షన్ హాల్‌లో సోమవారం మినీ మహనాడు కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కోట్ల కుటుంబంపై తప్పుడు ప్రచాచం చేసే వారికి భవిష్యత్తులో రాజకీయంగా పుట్టగతులుండవని పరోక్షంగా రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డిని ఉద్దేశించి వ్యాఖ్యానించినట్లు మహానాడులోనే చర్చ జరిగింది. ఇదిలా ఉంటే మినీ మహానాడుకు కనీస ఆహ్వానం లేనందు వల్లే హాజరుకాలేదని విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ సుబ్బారెడ్డి వర్గీయులు తెలిపారు. ఎమ్మెల్యేగా ఎన్నికైనప్పటి నుంచి ఏకపక్ష నిర్ణయాలు, ఒంటెద్దు పోకడలతో వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.

గిద్దలూరు ఉప సర్పంచ్ ఎన్నిక ఏకగ్రీవం



తలారి సుబ్బన్నకు ధ్రువపత్రం అందజేస్తున్న ఆర్‌ఓ

సంజామల: మండల పరిధిలోని గిద్దలూరు పంచాయతీ ఉప సర్పంచ్‌గా తలారి సుబ్బన్నను వార్డు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ నెల 16వ తేదీ బత్తుల సులోచన వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేశారు. గిద్దలూరు, మిక్కినేనిపల్లె, మంగపల్లె గ్రామలకు సంబంధించి 12 మంది వార్డు సభ్యులు ఉన్నారు. సోమవారం జరిగిన ఉప ఎన్నికకు ఏడుగురు సభ్యులు, సర్పంచ్ మద్దతు ఇవ్వడంతో ఎన్నిక ఏకగ్రీవం అయ్యింది. ఈ మేరకు ప్రిసీడింగ్ అధికారి రాధికారెడ్డి తలారి సుబ్బన్న(వైఎస్సార్‌సీపీ)కు ధ్రువపత్రం అందజేశారు. తనకు అవకాశం కల్పించిన మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. గిద్దలూరు సర్పంచ్ తెలుగు లక్ష్మి ఉసేనమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు బత్తుల రామచంద్రరెడ్డి, దేశాయ్ రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ బత్తుల సులోచన, పంచాయతీ కార్యదర్శి సురేష్ బాబు పాల్గొన్నారు.

భారీ వర్షాలపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ పవన్‌కుమార్‌రెడ్డి

కోవెలకుంట్ల: శక్తి తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అస్కారం ఉందని ప్రజలను అప్రమత్తం చేయాలని తహసీల్దార్ పవన్‌కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం తన కార్యాలయంలో మండలంలోని వీఆర్‌ఓలతో భారీ వర్షాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో మట్టిమిద్దెల్లో నివసించే కుటుంబాలు, శిథిలావస్థకు చేరుకున్న ఇళ్లలో ఉండేవారు తక్షణమే ఖాళీ చేసి సురక్షిత ప్రాంతానికి చేరేలా వీఆర్‌ఓలు చర్యలు తీసుకోవాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో తప్ప ఇళ్లలో నుంచి బయటకు రావద్దని ప్రజలకు సూచించారు. వర్షాల వల్ల ఏదైనా ప్రమాదం సంభవించినా, సహాయ సూచనల కోసం తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్‌రూం ఏర్పాటు చేశామన్నారు. 7799223243, 7013008740 నంబర్లు కంట్రోల్ రూపంలో అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. ఆర్ఐ రంజిత్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ పుల్లయ్య పాల్గొన్నారు.

అప్రమత్తత అవసరం

డోన్ టౌన్: కొద్ది రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని.. ముఖ్యంగా మట్టి మిద్దెలు, శిథిలావస్థకు చేరుకున్న ఇళ్లలో ఉంటున్న వారు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని తహసీల్దార్ నాగమణి అన్నారు. భారీ వర్షం కురిసే సమయంలో అవసరమైతేనే బయటకు రావాలని, ఏవైనా ప్రమాదాలు చోటు చేసుకుంటే సహాయం కోసం కంట్రోల్ రూం 9642439008, 8686336336, 760101197 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

అత్యవసర వేళలో సంప్రదించండి

బేతంచెర్ల: ఇటీవల కురుస్తున్న భారీ వర్షాల దృష్ట్యా ఎక్కడైనా నష్టం జరిగినా, విపత్కర పరిస్థితులు ఎదురైనా తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ ప్రకాశ్‌బాబు తెలిపారు. ప్రజలు అత్యవసర వేళలో ఈనెల 24వ తేదీ వరకు రెవెన్యూ అధికారులు మధు 7995481783, రఫీ 7386777871, రవి శంకర్ 8985703908 నంబర్లను సంప్రదించాలన్నారు.

బుగ్గన శేషారెడ్డి సేవలు చిరస్మరణీయం

- డోన్ నియోజకవర్గ వ్యాప్తంగా జయంతి వేడుకలు
- నివాళులర్పించిన వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు



డోన్‌లో బుగ్గన శేషారెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న శ్రీరాములు, బుగ్గన అర్జున్‌రెడ్డి



బేతంచెర్ల: నివాళులర్పిస్తున్న ఎంపీపీ, నగర పంచాయతీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ నాయకులు

డోన్: మాజీ ఎమ్మెల్యే రావు బహదూర్ బుగ్గన శేషారెడ్డి సేవలు చిరస్మరణీయం అని రాష్ట్ర మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు, బుగ్గన అర్జున్ అమర్నాథ్ రెడ్డి అన్నారు. సోమవారం శేషారెడ్డి జయంతి సందర్భంగా డోన్ పాతబస్టాండ్‌లోని ఆయన విగ్రహానికి వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి నివాళులర్పించారు. శేషారెడ్డి 1925లోనే డోన్ తాలుకా అభివృద్ధి బోర్డు అధ్యక్షునిగా పనిచేశారన్నారు. 1928 నుంచి 1936 మధ్య కాలంలో ఎమ్మెల్సీగా పనిచేశారని తెలిపారు. తన సొంత నిధులతో అనేక ప్రభుత్వ భవనాలు నిర్మించారని తెలిపారు. విద్య, వైద్య రంగంలో ఆయన చేసిన సేవలకు మెచ్చి అప్పటి బ్రిటీష్ ప్రభుత్వ వైస్రాయ్ శేషారెడ్డికి రావ్‌బహదూర్ బిరుదును ప్రదానం చేశారన్నారు. 1955–1962 కాలంలో డోన్ ఎమ్మెల్యేగా పనిచేశారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు బద్దల రాజ్‌కుమార్, మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, వైస్‌చైర్మన్ జాకీర్‌హుసేన్, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ మల్లెంపల్లె రామచంద్రుడు, వలంటీర్ విభాగం జిల్లా అధ్యక్షుడు పోస్టుప్రసాద్, పార్టీ మండల, పట్టణ శాఖ అధ్యక్షులు సోమేష్ యాదవ్, మల్లికార్జునరెడ్డి, నాయకులు కురుకుంద హరి, రాజవర్ధన్, నాగభూషణంరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, విశ్వనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బేతంచెర్ల: స్థానిక నంద్యాల క్రాస్ రోడ్డులోని శేషారెడ్డి విగ్రహానికి బుగ్గన అర్జున్‌రెడ్డి, ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. నగర పంచాయతీ వైస్ చైర్మన్ నాగ వెంకటేశ్వర్లు, వార్డు కౌన్సిలర్ మధు, ఉర్దూ అకాడమీ, ఫైనాన్స్ కార్పొరేషన్, గిడ్డంగుల శాఖ మాజీ డైరక్టర్లు బాబుల్ రెడ్డి, మూర్తుజావలి, ఖాజా హుసేన్, నాయకులు బుగ్గన చంద్రారెడ్డి, కాలిబేగ్, ఇబ్రహీం, జాకీర్, మురళీకృష్ణ, గూని నాగరాజు, ఖాజా, సలీం పాల్గొన్నారు. అలాగే శేషారెడ్డి ఉన్నత పాఠశాలలోని విగ్రహానికి ఐటీఐ, పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు నివాళులర్పించారు.

ప్యాపిలి: డోన్ నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే రావు బహదూర్ బుగ్గన శేషారెడ్డి చేసిన సేవలు చిరస్మరణీయం అని వైఎస్సార్‌సీపీ నాయకులు మెట్టు వెంకటేశ్వర్ రెడ్డి, బోరెడ్డి పుల్లారెడ్డి, గడ్డం భువనేశ్వర్ రెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, బొర్రా మల్లికార్జునరెడ్డి అన్నారు. స్థానిక కలచట్ల రోడ్డు వద్ద శేషారెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు జంగం చంద్రశేఖర్, కమతం భాస్కర్ రెడ్డి, బోరెడ్డి రాము, బోరెడ్డి కృష్ణారెడ్డి, బషీర్, కొండయ్య, వాసురెడ్డి, రఘు, ప్రభాకర్ రెడ్డి, రామ్మూర్తి పాల్గొన్నారు.



ప్యాపిలిలో..



బేతంచెర్లలో ఐటీఐ, పాలిటెక్నిక్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు

ఆదర్శప్రాయుడు సుందరయ్య



డోన్: పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నేతలు

డోన్ టౌన్: కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత, కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీపీఎం పట్టణ కార్యదర్శి నక్కి శ్రీకాంత్ అన్నారు. సోమవారం పుచ్చలపల్లి వర్ధంతి సందర్భంగా స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బడుగు, బలహీన వర్గాల కోసం ఆయన చేసిన సేవలను కొనియాడారు. ప్రజా సమస్యలపై ఎన్నో పోరాటాలు చేశారన్నారు. సీపీఎం నాయకులు కొండన్న, శివరామ్, భాస్కర్‌రెడ్డి, చిన్న రహిమాన్ తదితరులు పాల్గొన్నారు.

బేతంచెర్ల: బడుగుబలహీన వర్గాలు, కార్మికుల ఆశాజ్యోతి పుచ్చలపల్లి సుందరయ్య అడుగుజాడల్లో నడుద్దామని సీపీఎం నాయకులు ఎల్లయ్య, వెంకటేశ్వర్లు, సాధిక్ హుసేన్, రహంతుల్లా, మద్దిలేటి అన్నారు.సోమవారం సీపీఎం కార్యాలయంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు.

షటిల్ విజేతలకు బహుమతుల ప్రదానం



విజేతలతో బుగ్గన అర్జున్‌రెడ్డి, నిర్వాహకులు

డోన్: గ్రామీణ ప్రాంత చిన్నారుల్లో ఇమిడివున్న ప్రతిభను వెలికితీయగలిగితే జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులను చూసే అవకాశం లభిస్తుందని మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి తనయుడు బుగ్గన అర్జున్ అమర్నాథ్‌రెడ్డి అన్నారు. దివంగత బుగ్గన శేషారెడ్డి జయంతి సందర్భంగా బుగ్గన శేషారెడ్డి ఇండోర్ స్టేడియంలో రెండు రోజుల పాటు చిన్నారులకు నిర్వహించిన షటిల్ టోర్నమెంట్ విజేతలకు సోమవారం బహుమతులను అందజేశారు. వేసవి సెలవులను వృథా చేయకుండా క్రీడలపై మక్కువ చూపడం అభినందనీయమని పేర్కొన్నారు. ఇండోర్ స్టేడియంలో మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్ర మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ బద్దల రాజ్‌కుమార్, మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, వైస్ చైర్మన్ జాకీర్‌హుసేన్, కోచ్‌లు నాగేంద్ర, ఖాజా పాల్గొన్నారు.

రోడ్డుపై నీటి నిల్వ లేకుండా చర్యలు

కొలిమిగుండ్ల: స్థానిక స్టేట్ బ్యాంక్ ఎదురుగా ఉన్న 544–డీ జాతీయ రహదారిపై వర్షపునీరు నిల్వ లేకుండా ఎన్‌హెచ్ అధికారులు సోమవారం చర్యలు చేపట్టారు. రోడ్డు తగ్గుగా ఉండడం వల్ల చిన్నపాటి వర్షానికే నీరు పెద్ద ఎత్తున నిల్వ చేరి వాహనదారులతో పాటు పాదచారులకు అసౌకర్యంగా మారుతుంది. ఎట్టకేలకు ఎన్‌హెచ్ అధికారులు రోడ్డు ఎత్తును పెంచే పనులు చేయిస్తున్నారు. అడుగున్నర మేర గ్రావెల్ ఏర్పాటు చేసి తారు ఏర్పాటు చేస్తున్నారు. వర్షం కురిసినా నీరు నిల్వ చేరకుండా నేరుగా వెళ్లేలా చర్యలు చేపడుతున్నారు.

స్మార్ట్ మీటర్ పనుల అడ్డగింత



గౌరిపేటలో అడ్డుకుంటున్న సీపీఎం నాయకులు

బేతంచెర్ల: ఎన్నికల ముందు స్మార్ట్ మీటర్లు బిగించమని హామీ ఇచ్చిన టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత హామీని తుంగలో తొక్కి స్మార్ట్ మీటర్లు బిగించడం ఎంత వరకు సమంజసం అని సీపీఎం నాయకులు వెంకటేశ్వర్లు, ఎల్లయ్య, మధు శేఖర్ ప్రశ్నించారు. సోమవారం పట్టణంలోని గౌరిపేటలో స్మార్ట్ మీటర్లు బిగిస్తుండడంతో అడ్డుకున్నారు. స్మార్ట్ మీటర్లను ప్రస్తుతం ఉచితంగా బిగించి 90 నెలల వరకు ఈ మీటర్ ఖరీదును బిల్లులో పొందుపరుస్తూ ప్రజలపై భారం మోపడానికి కూటమి ప్రభుత్వం పూనుకుందని ఆరోపించారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
డోన్, బనగానపల్లె
90100 55532 (డోన్)
70750 09103 (బనగానపల్లె)
Office mail : sakshiknladvt@gmail.com